
# అమెరికా లో పెరుగుతున్న దారుణాలు -- తీసుకోవలసిన జాగ్రత్తలు



డాక్టర్. ప్రసాద్ తోటకూర

“ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్ షిప్ కౌన్సిల్” జాతీయ సంఘానికి అధ్యక్షులు

తానా మాజీ అధ్యక్షులు

డల్లాస్, టెక్సాస్ లో గత మూడు దశాబ్దాలుగా స్థిర నివాసం

---------------------------------------------------------------------

ఇటీవల కాన్సాస్ నగరంలో జరిగిన కాల్పుల సంఘటన ఎంతో దురదృష్టకరం. ఈ దుర్ఘటనలో ప్రాణాలను కోల్పోయిన శ్రీనివాస్ కూచిబొట్ల కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాము. ఇదే సంఘటనలో గాయపడిన అలోక్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాము . తన ప్రాణాలు సైతం పణంగా పెట్టి ఎంతో సాహసోపేతముగా అలోక్ రెడ్డి ప్రాణాన్ని కాపాడిన ఇయాన్ గ్రిల్లాట్ కు మా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఇటీవల కాలంలో భారతీయ అమెరికన్ల పై ఇలాంటి దాడులు జరగడం పెరుగుతున్నది. అమెరికా నేర చరిత్రను విశ్లేషిస్తే, దురదృష్టవశాత్తు ఇలాంటి దాడులు ఇటీవల కాలంలో కనీసం 15 వరకు సంభవించాయి. ఉదాహరణకు-- జూన్ 2016 లో, ఓర్లాండో పల్స్ నైట్ క్లబ్ షూటింగ్ లో 50 మంది మరణించడం మరో 53

మంది తీవ్రంగా గాయపడడం విచారకరం.   డిసెంబర్ 2012 లో శాండీ హుక్ ఎలిమెంటరీ స్కూల్, కనెక్టికట్ లో ఓ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో 20 మంది పిల్లలు తో సహా మొత్తం 26 మంది చనిపోవడం అత్యంత భాధాకరం. చాలా సందర్భాల్లో మన అనేక మంది భారత అమెరికన్లు అర్థరాత్రి వేళలో పెట్రోల్ బంకుల్లో   పనిచేస్తుండగా దుండగులు జరిపిన కాల్పుల్లో తమ ప్రాణాలు కోల్పోయారు. ఇటువంటి దారుణ మారణ కాండ తరచుగా జరగడానికి బహిరంగ మార్కెట్లో సులభంగా లభ్యమయ్యే తుపాకులు ప్రధాన కారణం. ఎటువంటి వ్యక్తిగత విచారణ లేకుండానే ఎవరైనా డబ్బులిచ్చి ఎప్పుడైనా ఏ తుపాకినైనా సులభంగా కొనుక్కోవడం, కొన్ని బలహీన క్షణాల్లో ఆ తుపాకిని యథేచ్ఛగా వాడడం ఈ ప్రమాదాలకు కారణభూతం అవుతుంది.

ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్ షిప్ కౌన్సిల్ జాతీయ సంస్థ తరపున, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కు  ముఖ్యంగా ఇటీవల యూఎస్ కాంగ్రెస్ కు ఎన్నికైన మన భారత సంతతికి చెందిన- శ్రీమతి కమల హారిస్, శ్రీమతి ప్రమీల జయపాల్, శ్రీ రాజా కృష్ణమూర్తి, శ్రీ రో ఖన్నా, డాక్టర్. అమీ బెరాలకు ఈ దాడులను తీవ్రంగా పరిగణించి మున్ముందు జరగకుండా కఠిన చట్టాలను అమలు చేయవలిసిందిగా ప్రత్యేక లేఖలు వ్రాశాము. అంతేగాక, గన్ లైసెన్సింగ్ విధానాన్ని పునఃసమీక్షించి తగిన మార్పులు, ఆయుధాలు క్షుణ్ణంగా నేపథ్య తనిఖీలు తర్వాత మాత్రమే తుపాకుల కొనుగోలుకు అనుమతించే విధముగా చట్టాన్ని సవరించాలి. జాతి వివక్ష దాడులు పెరుగుతున్న కారణంగా జాతీయ స్థాయిలో "జాతి వివక్ష పరిశీలన - నిరోధక" కమిషన్ ను ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించి ఇలాంటి చర్యలకు పాల్పడిన వారి పై తక్షణమే కఠిన శిక్షలు అమలుచేయాలని విజ్ఞప్తి చేశాము. ఇలాంటి ఘటనలను నిశితముగా పరిశీలిస్తే భారతీయులంటే స్థానిక అమెరికన్లలో కరుడు గట్టిన జాతి విద్వేష వివక్ష ఒక ప్రధాన కారణమని కూడా  తెలుస్తుంది.

భారత అమెరికన్ల మీద ద్వేషం, కోపం, నిరాశలతో కొద్ది మంది జాత్యహంకార విద్వేషాన్ని పెంచుకున్నప్పటికీ , అమెరికన్ సొసైటీ లో చాలా మంచి కూడా ఉంది. ఇదే అమెరికన్ వ్యవస్థ వివిధ రంగాల్లో లక్షలాది మంది ప్రవాస భారతీయులకు ఉపాధి, ఉన్నత అవకాశాలు కల్పించడం, ముఖ్యంగా  కార్పొరేట్ రంగంలో- సత్య నాదెళ్ల  (మైక్రోసాఫ్ట్), సుందర్ పిచాయి (గూగుల్), ఇంద్రా నూయి (పెప్సి) మొదలైన పలు భారతీయ అమెరికన్లకు చాలా ఉన్నత స్థానాలను కల్పించింది. ఒక అమెరికన్ కరుడు గట్టిన కోపంతో కూచిబొట్ల ప్రాణాలను తీస్తే, పక్కనే ఉన్న మరో స్థానిక అమెరికన్ తన ప్రాణాలకు తెగించి అలోక్ రెడ్డి ప్రాణాలను కాపాడాటమే అమెరికన్ల మంచితనానికి ముఖ్య ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

నా అభిప్రాయంలో అమెరికా లో నివసిస్తున్న భారతీయులు కొన్ని నిర్దిష్ట మార్గదర్శకాలను అనుసరిస్తే అమెరికా వంటి గొప్ప దేశంలో ఒక ప్రశాంతమైన జీవితం సాగించవచ్చు.

## అమెరికా లో నివసిస్తున్న భారతీయులు తీసుకోవలసిన జాగ్రత్తలు

1. **ఇరుగు పొరుగు వారితో పరిచయం:**
   - కనీసం మీ ఇంటి చుట్టుపక్కల నివసిస్తున్న వారి పేర్లు , వివరాలు తెలుసుకోండి.
   - అంతేగాక వారిని మీరు జరుపుకొనే కొన్ని భారతీయ సంప్రదాయ వేడుకులకు ఆహ్వానించి మన సంస్కృతితో అనుభందం ఏర్పాటు చేయండి.
   - మీరు వీకెండ్ పార్టీలు, విందులు, వినోదాలు చేసుకుంటున్నప్పుడు రణగుని ధ్వనులు, లౌడ్ మ్యూజిక్ పాటలతో మీ ఇరుగు పొరుగు వారికి అసౌకర్యం కలిగించకండి.
   - తెల్లవారకముందే శబ్దంతో మీ గార్డెన్ , లాన్ మొయింగ్ పరికరాలతో ఇతరుల నిద్రకు భంగం కలిగించకండి.
   - మీ కార్లు లేదా మీ అతిధుల కార్లను మీ ఇరుగు పొరుగు వాళ్ళ ఇంటి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా కార్ పార్కింగ్ చేయండి.

2. **అమెరికా జాతీయ జెండాను ఎల్లప్పుడు గౌరవించడం:**
   - ఎప్పుడూ భారతదేశపు జెండాను ఒంటరిగా ఎగరవేయకండి. దాని ప్రక్కనే అమెరికన్ జాతీయ జెండాను కూడా ఎగరవేయండి.
   - ఇరు దేశాల జెండాలను ఎగరవేసేటప్పుడు, జాతీయ గీతాలను ఆలాపించేటప్పుడు నిర్దిష్టమైన నియమావళిని పాటించండి.
   - ఎల్లప్పుడూ అమెరికా రాజ్యాంగానికి, చట్టాలకు కట్టుబడండి.

3. దుస్తులను ధరించే విధానం:
   - మనం ధరించే దుస్తులు బహిరంగ ప్రదేశాల్లో ఇతరులకు వింతగా, ఇబ్బంది కలిగించే విధంగా ఉండనివ్వకండి.

4. ఇతరుల **శాంతికు భంగం కలిగించకండి**:

- ❖ కొన్ని సందర్భాలలో ప్రముఖ రాజకీయ నాయకులు, సినిమా నటీనటులు వచ్చినప్పుడు అత్యుత్సాహముతో కేరింతలు, నినాదాలు, బ్యానర్లు, ర్యాలీలు తో వందల కొద్దీ సమూహముగా జేరి వారు బస చేస్తున్న హోటళ్లలోనూ, సినిమా హాళ్లలోనూ, ప్రధాన బహిరంగ వేదికల వద్ద నినాదాలతో హోరెత్తించడం తగని చర్య. ఇలాంటి కొన్ని సందర్భాలలో పోలీసులు వచ్చి అందరిని చెల్లాచెదురు చేసిన సంగతులు మన గౌరవ ప్రతిష్టను దెబ్బ తీశాయి.

5. **<u>భారత దేశం నుంచి వచ్చే సందర్శకులు:</u>**

తమ కుటుంబసభ్యులను చూడటానికి వచ్చే తల్లిదండ్రులకు, అతిధులకు ముందు గానే ఆమెరికా సంస్కృతీ సంప్రదాయాల పట్ల ఒక రకమైన అవగాహన కల్పించడం విధిగా చేయవలసిన పని. ఉదాహరణకు:

- ❖ అమెరికన్ల వైపు ముఖ్యంగా వారు స్విమ్ దుస్తుల్లో ఉన్నప్పుడు, తదేకంగా వారి వైపు చూడటం గాని, వారిపై అపహాస్యంగా నవ్వడంగాని, పరాయి భాషలో మాట్లాడటం గాని తగని పని.
- ❖ అలవాటు ప్రకారం పిల్లలు ముద్దుగా ఉన్నారు కదా అని అమెరికన్ చిన్న పిల్లలను పట్టుకోవడం, ముద్దాడటం, మన తినుబండారాలు పెట్టడం కూడని చర్య.
- ❖ భారతదేశం నుండి వచ్చిన తల్లిదండ్రులు / అతిధులు ను మన చుట్టూ ఉన్న పరిసరాలకు అలవాటు పడేవరకు ఒంటరిగా వదలకండి.

6. **<u>గుర్తింపు కార్డు:</u>**

- ❖ ఎల్లప్పుడూ మీ చట్టపరమైన పాస్ పోర్ట్ లేదా ఐడి కాపీలను మరియు సెల్ ఫోన్ను అందుబాటులో మీ దగ్గరే ఉంచుకోండి.
- ❖ ఎల్లప్పుడూ పోలీసు, భద్రతాధికారుల సూచనలను అనుసరించండి.

7. <u>వికలాంగ సంబంధిత:</u>

- ❖ వికలాంగులకు కేటాయించిన స్థానాలను వారికే వదిలేయండి.
- ❖ కొన్ని నిముషాలకైనా వారి పార్కింగ్ స్థానాలను ఉపయోగించకండి.
- ❖ వాహనాలను నడిపేటప్పుడు పాదచారులకు ఎప్పుడు దారి ఇవ్వండి.
- ❖ పాఠశాల దగ్గర వేగ పరిమితుల ను అనుసరించండి.
- ❖ అడ్డదిడ్డంగా రోడ్లను దాట రాదు.

**8.** <u>సామాజిక ప్రవర్తన:</u>

- ఎల్లప్పుడూ వాస్తవాలను మాత్రమే చెప్పండి.
- సంబంధిత అధికారుల తో వ్యవహరించేటప్పుడు వారికి చాలా గౌరవ మర్యాదలు ఇవ్వండి. న్యాయం మీ పక్షాన ఉన్నప్పటికీ మీరు చెప్పే విషయం సరైనది అయినప్పటికీ అవతల వారితో ఎటువంటి వాదనకు, ఘర్షణకు దిగకండి.
- ముఖ్యముగా విమానాశ్రయాలు, రెస్టారెంట్లు, బార్లు, పార్కులు తదితర ప్రాంతాల్లోఎప్పుడూ జోక్స్, తమాషాలు చేయకండి.
- బహిరంగ ప్రదేశాల్లో మందు త్రాగడం, గట్టిగా అరవడం, మాట్లాడటం చేయడం చట్ట విరుద్ధం.
- మనకున్న మత / ఆధ్యాత్మిక స్వేచ్ఛ ను సద్వినియోగ పరచుకుంటూనే ఇతరుల మనోభిప్రాయాలకు విఘాతం కలగకుండా చూడండి.
- అర్ధరాత్రుల వరకు బార్లు, రెస్టారెంట్లు మరియు పబ్బులలో ఉండడం నివారించండి.

9. <u>సాంఘిక ప్రసార మాధ్యమం</u>

- సాంఘిక ప్రసార మాధ్యమాలలో-- వాట్సాప్ , ఫేస్ బుక్ , ట్విట్టర్ లలో ఈమెయిల్స్ , మెసేజెస్ ద్వారా పుకార్లను సరదాకు అయినా వ్యాప్తి చేయరాదు.
- అశ్లీల వెబ్ సైట్ల లలో చాట్ చేయరాదు. అలా చేసిన వారిని రహస్యంగా అధికారులు పట్టుకొని వెంటనే దేశమునుండి బహిష్కరించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

**<u>10. చట్టపరమైన హక్కులు:</u>**

- మీ ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతున్నదని భావించినప్పుడు చట్టాలను ఆశ్రయించండి.
- మిమ్మల్ని మీరు రక్షించు కొనే పరిస్థితి లో లేకపోతే వాటిని ఎదుర్కొనేందుకు ఎటువంటి వాదనకు, ఘర్షణలకు, సాహసాలకు పోకండి.
- మీ దగ్గర ఉన్న నగదు, విలువైన వస్తువులు కన్నా ఎల్లప్పుడూ మీ ప్రాణం అత్యంత విలువైనదని భావించండి.

**11. చట్ట వ్యతిరేకపు ప్రవర్తన:**

- వివిధ రంగాలలో-- వైద్య, ఆరోగ్య, న్యాయ, ఆర్థిక, ఐటి రంగాలలో ఉన్న ప్రముఖులు కొంత మంది దురాశకు పోయి చట్ట వ్యతిరేక పానములకు పాల్పడి, ఆర్థిక నేరాల్లో ఇర్రుకొన్ని జైళ్లలో మగ్గుతున్న వారు ఎందరో ఉన్నారు.
- అమెరికా లో అక్రమంగా నివసించే వారికి ఎటువంటి ఆశ్రయం ఇవ్వడం కానీ, ఉద్యోగంలో పెట్టడం కానీ చేయకూడదు, ఇలాంటి ఘటనలకు దేశం నుంచి వెనువెంటనే వారిని బయటకు పంపుతారు/బహిష్కరిస్తారు.

**12. వ్యక్తిగత భద్రత:**

- ఎల్లప్పుడూ ఇంటి తలుపులు వేసుకొని ఉండండి.
- ఎవరైనా తెలియనివారు, క్రొత్త వారు వచ్చినప్పుడు తలుపు తీయకండి.
- అతి తక్కువ సమయానికి ఇంటి నుండి బయటకు వెళ్ళవలసివచ్చినప్పుడు ఇంటికి సంబంధించిన భద్రత అలారం ను ఆన్ చేయాలి.
- పార్టీలకు, శుభ కార్యాలకు వెళ్ళినప్పుడు మనకు బంగారం బాగా ధరించడం అలవాటు. ఇది మన భద్రతకు చాలా ముప్పు. అమెరికా లో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నో వేలాది దొంగతనాలు జరగడానికి ఇదొక కారణం. కాబట్టి, మన విలువైన వస్తువులను, బంగారు నగలను బ్యాంకు లాకర్ లలో సంరక్షించుకోవాలి.
- ఇంటి బయటకు కానీ, లోపలకు కాని వచ్చేటప్పుడు మన పరిసర ప్రాంతాలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండండి.

**13. పిల్లల సంరక్షణ:**

- ఎప్పటికి కూడా మన కోపాన్ని, విసుగును, నిరాశ ను మన పిల్లల మీద చూపించకండి.
- పిల్లలను ఏనాడూ కొట్టడం లాంటివి చేయకండి.
- పిల్లలను ఒంటరిగా ఏనాడూ ఇంట్లో వదలరాదు. అలాగే బయటకు వెళ్ళినప్పుడు మన వాహనాలలో కొన్ని నిముషాలకైనా సరే, వాళ్ళని ఒంటరిగా వదిలేయకండి.
- పిల్లల పై దురుసుగా ప్రవర్తిస్తే, పిల్లల రక్షిత సేవా సంస్థ (చైల్డ్ ప్రొటెక్టీవ్ సర్వీసెస్) వారు పిల్లలను తీసుకొని వెళ్లి పోతారు. మనలను కూడా బాగా శిక్షిస్తారు.

**14. పౌరులుగా మన భాద్యత:**

- మనము అమెరికా దేశంలో నే స్థిరపడటానికి నిర్ణయం తీసుకున్నాం కాబట్టి, ఈ దేశపు జన జీవన స్రవంతిలో మనము  కలిసిపోవాలి.
- మన దేశపు సంప్రదాయ విలువలను కాపాడుతూ, వాటిని పాటిస్తూనే, ఇక్కడి సమాజంలో ఇమడగలగాలి.
- స్థానిక అధికారులు, రాజకీయ నాయకులతో పరిచయం, సంభందం కలిగి ఉండండి.
- అలాగే మనము కొంత సమయాన్ని స్వచ్ఛందంగా సామజిక సేవ కోసం కేటాయించగలగాలి. ఉదాహరణకు వివిధ పాఠశాలలో, గ్రంథాలయాల్లో, ఆసుపత్రుల్లో, ప్రభుత్వ కార్యకలాపాలలో పాలుపంచుకోవడానికి  స్వచ్ఛందంగా కృషి చేయాలి.

-- డాక్టర్. ప్రసాద్ తోటకూర

"ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్ షిప్ కౌన్సిల్" జాతీయ సంఘానికి అధ్యక్షులు

తానా మాజీ అధ్యక్షులు

డల్లాస్, టెక్సాస్ లో గత మూడు దశాబ్దాలుగా స్థిర నివాసం